# కారు బీభత్సం

- ఒకరు మృతి.. ముగ్గురికిగాయాలు

కొత్తకోట, ఫిబ్రవరి 9 : ఫుల్‌గా మద్యం తాగిన వ్యక్తి కారు నడిపి బీభత్సం సృష్టించిన ఘటనలో ఒకరు మృతి చెందగా ముగ్గురికి గాయాలయ్యాయి.



బీభత్సం సృష్టించిన కారు

వనపర్తి కొత్తకోట పట్టణంలోని శుక్రవారం రాత్రి 8 గంటల సమయంలో రాయినిపేట గ్రామానికి చెందిన సతీశ్‌రెడ్డి అతిగా మద్యం తాగి కారును నడుపుకొంటూ పట్టణంలోని బస్టాండ్ సమీపంలో బైక్‌పై వెళ్తున్న బావబామ్మర్దులు అంజి, ఆంజేయులును ఢీకొట్టాడు. దీంతో భయాందోళనకు గురై నడుచుకుంటూ వెళ్తున్న మరో వ్యక్తి రామును సైతం ఢీకొన్నాడు. అంతటితో ఆగకుండా కారు వేగంగా నడిపి పోలీస్‌స్టేషన్‌లో సమీపంలో బైక్‌పై వెళ్తున్న గొల్ల నర్సింహులును (30) ఢీకొట్టాడు. దీంతో అతడు మృతి చెందాడు. గాయపడిన బావబామ్మర్దులను వనపర్తి ఏరియా దవాఖానకు తరలించగా.. రామును స్థానిక ప్రైవేట్ దవాఖానకు తరలించారు. మృతి చెందిన నర్సింహ స్వగ్రామం రామకృష్ణాపురం. సతీశ్‌రెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై మంజునాథ్‌రెడ్డి తెలిపారు.

# కళతప్పిన కృష్ణమ్మ



నారాయణపేట జిల్లా మక్తల్ టైరోడ్డు వద్ద నీటి ప్రవాహం లేక బోసిపోయిన కృష్ణానది

- భారీగా తగ్గిన నీటి ప్రవాహం
- నదిలో నీళ్లులేక తేలిన రాళ్లు
- కర్ణాటకలోఎక్కడికక్కడనీటిని అడ్డుకోవడంతో ఎడారైనవైనం
- ఆందోళనలో నదీతీర రైతులు

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 9 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): తెలంగాణలో జీవనది అయిన కృష్ణమ్మ గలగలలు ఆగిపోయాయి. ఎండాకాలం ఇంకా రాకముందే కృష్ణానది పూర్తిగా వట్టిపోయింది. తెలంగాణలో కృష్ణానది అడుగుపెట్టే ప్రాంతం నుంచి జూరాల ప్రాజెక్టు వరకు ఎక్కడ చూసినా నదిలో నీటి జాడ కనిపించడం లేదు. నీళ్లన్నీ అడుగంటడంతో అటూ ఇటూ జనం తిరుగుతున్నారు. పశువులకు దాహార్తి తీర్చుకోవాలన్నా కష్టతరమైపోయింది. నదీ పరివాహక ప్రాంతాల్లో కృష్ణానది జలాలతో వేలాది ఎకరాలు యాసంగి పంటల సాగు కూడా ప్రశ్నార్థకమంగా మారాయి. సమీప ప్రాంతాల ప్రజలకు తాగునీరు ఇబ్బంది నెలకొంది. బోరు బావుల్లో నీళ్లు అడుగంటుతున్నాయి. ప్రతి ఏటా పాయలుగా నదిలో పారే నీరు కనిపించడం లేదు. చుక్కనీరు లేక కృష్ణమ్మ బోసిపోయింది. జూరాల ప్రాజెక్టు ఎగువ భాగం పూర్తిగా ఎండిపోయింది. గతంలో ఎన్నడూ ఇలాంటి పరిస్థితి రాలేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### ఎండిపోతున్నకృష్ణమ్మ..

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వరప్రదాయిని అయిన కృష్ణానది ఫిబ్రవరి ప్రారంభంలోనే నీళ్లు లేక ఎండిపోయింది. నారాయణపేట జిల్లాలోని కృష్ణ మండలంలో అడుగుపెట్టే ఈ జీవనది తెలంగాణ, కర్ణాటక సరిహద్దుల్లో ప్రవేశించి జూరాలలో కలుస్తుంది. కృష్ణానది తంగిడి నుంచి సంగమేశ్వరం, కృష్ణ టై రోడ్డు, మురహర్‌దొడ్డి, ముడుమాల, మందిపల్లి, కొల్పూరు, పసుపుల, పారేవుల, పంచదేవ్‌పహాడ్, గాగన్‌పల్లి, అనుగొండ మీదుగా జూరాల ప్రాజెక్టులోకి ప్రవేశిస్తుంది. ప్రస్తుతం నదీ ప్రారంభం నుంచి ఆరు కిలోమీటర్ల మేర అక్కడక్కడా నీరు కనిపించినా.. టై రోడ్డు బ్రిడ్జి నుంచి కృష్ణానదిలో నీళ్లు లేక రాళ్లూ, రప్పలే కనిపిస్తున్నాయి. గతంలో ఈ పరిస్థితిని ఊహించి కొంతమంది నదిలో 365రోజులు నీళ్లు ఉండాలనే ఉద్దేశంతో అంతర్గత కాల్వలను తవ్వించారు. ఈ కాల్వలో నీళ్లు ఎప్పటికీ ఉండేలా ఏర్పాటు చేశారు. పశువులు, కాపరులకు నీళ్లు తాగేందుకు వీటిని ఉపయోగించే వాళ్లు. పరివాహక ప్రాంతాల్లో నీటి ఎద్దడి నెలకొన్నప్పుడు ఈ కాల్వ ద్వారా నీళ్లు తీసుకొనే అవకాశం ఉండేది. ప్రస్తుతం ఈ కాల్వల్లో కూడా నీరు అడుగంటి పోయింది. ఈ మధ్య కాలంలో ఎప్పుడూ ఇలాంటి పరిస్థితి రాలేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. మక్తల్ మండలం పారేవుల వద్ద నియోజకవర్గంలోని సగం గ్రామాలకు సత్యసాయి ట్రస్టు ద్వారా రోజూ తాగునీరు అందిస్తారు. నదిలో నీళ్లు అడుగంటి పోవడంతో తాగునీరు కూడా ప్రశ్నార్థకంగా మారింది.

### కాలినడకన నదిని దాటుతున్న రెండు ప్రాంతాల వాసులు

కృష్ణానదిపై గతంలో పుట్టీల ద్వారా ప్రయాణించే తెలంగాణ, కర్ణాటక ప్రాంతాల ప్రజలు ప్రస్తుతం నీళ్లు లేకపోవడంతో కాలినడకన అటూ ఇటు తిరుగుతున్నారు. మరోవైపు తెలంగాణ కర్ణాటక సరిహద్దుల్లో ప్రధాన రహదారి మీద వంతెన మరమ్మతులు కూడా సాగుతుండడంతో ప్రజలు నదిలో నుంచి ప్రయాణాలు సాగిస్తూ అటు నుంచి ఆటోలు, బస్సుల్లో తమ గమ్య స్థానాలకు చేరుకుంటున్నారు.


### ప్రశ్నార్థకంగా యాసంగి సాగు..

నారాయణపేట జిల్లాలో కృష్ణానదీ పరివాహక ప్రాంతాన్ని నమ్ముకొని వందలాది ఎకరాల్లో రైతులు పంటలు సాగు చేసుకున్నారు. కృష్ణానదిలో నీళ్లు 24గంటలు లభ్యం కావడంతో చాలామంది రైతులు వరి పంటను సాగు చేస్తున్నారు. ప్రస్తుతం పంట వేసుకున్న రైతులు నదిలో నీరు అడుగంటి పోవడంతో తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ప్రత్యేక పైపులైన్లను నది లోపలికి తీసుకెళ్లి ఎక్కడ నీళ్లు ఉంటే అక్కడి నుంచి పంటలకు నీళ్లను తీసుకెళ్లే పరిస్థితి వచ్చింది. ఫలితంగా నీళ్ల కోసం ప్రత్యేకంగా పైపులను కొనుగోలు చేసి నదిలో తీసుకెళ్లి మోటర్లకు బిగిస్తున్నారు. వేసుకున్న పంటలను కాపాడుకోవడానికి రైతులు అష్టకష్టాలు పడుతున్నారు.

### కృష్ణమ్మనుఅడ్డుకున్న కర్ణాటకప్రభుత్వం

తెలంగాణలో కృష్ణానది ఎండిపోతే పక్కనే ఉన్న కర్ణాటకలో మాత్రం నది నిండుగా కనిపిస్తున్నది. అక్కడి రైతులు, అధికార యంత్రాంగం తెలంగాణలోకి కృష్ణానదీ జలాలను వదలకుండా ఎక్కడికక్కడ నదిలో ఇసుక బస్తాలు వేసి అడ్డుకుంటున్నారు. ఫలితంగా పక్కనే ఉన్న కర్ణాటకలో కృష్ణానది నిండుగా కనిపిస్తుంటే తెలంగాణలో మాత్రం రాళ్లుతేలి బోసిపోయింది. అంతేకాకుండా తెలంగాణ సరిహద్దులో కర్ణాటక థర్మల్ ప్రాజెక్టు ఉండడంతో థర్మల్ ప్రాజెక్టుకు నీటి సరఫరా కోసం ప్రత్యేకంగా కాల్వను ఏర్పాటు చేసి కర్ణాటక వైపు నీళ్లను మళ్లిస్తున్నారు. ఇటు తెలంగాణను ఎండబెడుతున్నారు. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వంతో మాట్లాడి రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీరు అందించి ఆదుకోవాలని కోరుతున్నారు.

- పీవీ నరసింహారావుకు అత్యున్నత పురస్కారం
- తెలుగు బిడ్డకు గౌరవం దక్కడంపై సంతోషం



ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా హర్షాతిరేకాలు

# బహుభాషా కోవిదుడికి భారతరత్న

తెలుగు బిడ్డ, మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు అత్యున్నత గౌరవం దక్కింది. బహుభాషా కోవిదుడిగా, ఆర్థిక సంస్కరణ విధానాన్ని ప్రవేశపెట్టి జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన మహోన్నతుడికి భారతరత్న పురస్కారం లభించింది. తెలుగు రాష్ట్రాల నుంచి తొలి వ్యక్తిగా ఆయన నిలిచారు. దీంతో ఉమ్మడి పాలమూరు జిల్లా వ్యాప్తంగా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, రాజకీయ, వివిధ సంఘాల నాయకులు, కవులు, రచయితలు ఆయనకు ఘనంగా నివాళులర్పించారు.

### 'ప్రముఖులకు భారతరత్న హర్షణీయం' : నిరంజన్‌రెడ్డి



వనపర్తి, ఫిబ్రవరి 9 : దేశంలోని ప్రముఖులైన ఎంఎస్ స్వామినాథన్, బహుభాషా కోవిదుడు పీవీ నరసింహా రావుకు భారతరత్న ప్రకటించడం హర్షణీయమని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. దేశంలో హరితవిప్లవ పితామహుడు ఎంఎస్ స్వామినాథన్, భారత మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు భారతరత్న ప్రకటించడం దేశ ప్రజలకు గర్వకారణమన్నారు. ఎంఎస్ స్వామినాథన్ బతికుండగానే ఈ అవార్డు అందించాల్సి ఉండేదని గుర్తు చేశారు. తెలంగాణ ముద్దుబిడ్డ పీవీకి ఈ పురస్కారం రావడం చాలా సంతోషకరమైనదన్నారు.

# పారితోషికాలు చెల్లించాలి

- కలెక్టరేట్ ఎదుట ఆశా వర్కర్ల ఆందోళన



గద్వాల కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న ఆశా కార్యకర్తలు

గద్వాల, ఫిబ్రవరి 9 : పెండింగ్‌లో ఉన్న పారితోషికాలను చెల్లించాలని, గత ప్రభుత్వ హామీలను అమలు చేయాలని కోరుతూ ఆశా వర్కర్లు కలెక్టరేట్ ఎదుట శుక్రవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం ప్రతి నెలా 2వ తేదీన తమ ఖాతాల్లో పారితోషికాలు జమ చేసేదని, ప్రస్తుతం రెండు నెలలు దాటినా వాటిని చెల్లించకపోవడంతో అప్పులు చేయాల్సి వస్తున్నదని వాపోయారు. అభయహస్తం, మహాలక్ష్మి వంటి అదనపు పనులు చేయిస్తున్నారని, వాటిని తమకు అప్పగించొద్దని కోరారు. ఏఎన్‌సీ డెలివరీల పేరుతో టార్గెట్ పెట్టి భయభ్రాంతులకు గురిచేసే విధానాన్ని రద్దు చేయాలని, సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ప్రమాద బీమా కింద రూ.5లక్షలు చెల్లించాలని, ప్రమోషన్స్, ప్రసూతి సెలవులు వంటి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టరేట్ ఏవోకు అందజేశారు.



ర్యాలీగా వస్తున్న ఆశా కార్యకర్తలు

# తాసీల్దార్‌ఆఫీస్‌లో అర్ధరాత్రి హైడ్రామా!

- జూనియర్‌అసిస్టెంట్, మాజీ సర్పంచ్‌పై కేసు నమోదు



తాసీల్దార్ కార్యాలయం రికార్డు గదిలో మాజీ సర్పంచ్ బోడ్కానాయక్

అచ్చంపేట రూరల్, ఫిబ్రవరి 9: అచ్చంపేట తాసీల్దార్ కార్యాలయంలో గురువారం అర్ధరాత్రి హైడ్రామా నడిచింది. జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న పాత్లావత్ హనుమంతు, బొమ్మనపల్లి మాజీ సర్పంచ్ రాత్లావత్ బోడ్కానాయక్ 12 గంటల తరువాత తాసీల్దార్ కార్యాలయంలోని రికార్డు గదిలో పలు భూముల రికార్డులను తారుమారు చేసేందుకు ప్రయత్నించగా గమనించిన ప్రజాసంఘాలు, పార్టీల నాయకులు అడ్డుకొని పోలీసులకు సమాచారమిచ్చారు. దీంతో సీఐ రవీందర్, ఎస్సై రాములు కార్యాలయానికి చేరుకుని ఇద్దరినీ అదుపులోకి తీసుకున్నారు. అత్యవసర పనుల నిమిత్తం ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలున్నాయా అని ఆర్ఐ కృష్ణాజీని అడిగి తెలుసుకున్నారు. అలాంటివేవీ లేవని ఆర్ఐ సమాధానం చెప్పారు. ఈ విషయమై తాసీల్దార్ పాండూనాయక్‌ను వివరణ కోరగా బోడ్కానాయక్ తమకు సంబంధించిన కల్యాణలక్ష్మి పెండింగ్ పనులు చేయించుకోవడానికి హనుమంతుతో కలిసి కార్యాలయానికి వెళ్లినట్లు తెలిపారు. అర్ధరాత్రి వేళ ఆఫీసుకు వెళ్లడంతో జూనియర్ అసిస్టెంట్ హనుమంతుపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు నివేదించినట్లు ఆయన తెలిపారు. అదేవిధంగా ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేయాలని అచ్చంపేట పోలీసులను ఆదేశించినట్లు తాసీల్దార్ పేర్కొన్నారు. పోలీసులు పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తేనే అసలు విషయం బయటపడనున్నది. పెండింగ్ పనుల పేరు చెప్పి అర్ధరాత్రి భూ రికార్డులు, కంప్యూటర్ గదిలోకి చొరబడడం పలు అనుమానాలకు తావిస్తున్నదని మండల ప్రజలు చర్చించుకుంటున్నారు.

# పరిహారం పెంచాలి

- భారత్‌మాల రోడ్డు పనులు అడ్డుకున్నరైతులు

అయిజ రూరల్, ఫిబ్రవరి 9 : భారత్‌మాల రహదారి నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు ఇచ్చే పరిహారాన్ని పెంచాలని శుక్రవారం రైతులు ఆందోళన చేపట్టారు. మండల పరిధిలోని గుడిదొడ్డి, జడదొడ్డి, తూంకుంట, వెంకటాపురం గ్రామాలకు చెందిన రైతులు భారత్‌మాల రహదారి నిర్మాణంలో భూములు కోల్పోయారు. ఈక్రమంలో తమకు వచ్చే పరిహారాన్ని పెంచాలని కోరుతూ రహదారి పనులకు మట్టిని తరలిస్తున్న టిప్పర్లను రైతులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ భూములను తక్కువ ధరకు తీసుకున్నారని, గిట్టుబాటు కాదని తేల్చిచెప్పారు. అధికారులు స్పందించి పరిహారం పెంచకపోతే రహదారి పనులను అడ్డుకుంటామని హెచ్చరించారు. ఆందోళనలో నర్సింహులు, రాముడు, లక్ష్మన్న, తిరుమలేశ్, నాగరాజు, వెంకట్రాములు, లక్ష్మన్నతదితరులు పాల్గొన్నారు.

# బ్రహ్మోండోత్సవం

- నేటి నుంచి అలంపూర్‌లో ఉత్సవాలు
- 14న జోగుళాంబ నిజరూప దర్శనం

అలంపూర్, ఫిబ్రవరి 9 : ఐదో శక్తి పీఠమైన అలంపూరులో బ్రహ్మోత్సవాలకు వేళైంది. జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయాల్లో 10 నుంచి 14వ తేదీ వరకు వైభవంగా ఉత్సవాలు నిర్వహించనున్నారు. ప్రతి యేటా వసంత పంచమి రోజు అమ్మవారు భక్తులకు నిజరూప దర్శన భాగ్యం కల్పించనున్నారు. పక్కల రాష్ట్రాల నుంచే కాకుండా మన రాష్ట్రం నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలిరానున్నారు. గ్రామ దేవతల అలంకరణ, ప్రభోత్సవం, గ్రామోత్సవం ఉత్సవాల్లో ప్రత్యేక ఆకర్షణగా నిల్వనున్నాయి.

### ఉత్సవాలుఇలా..

☛ 10వ తేదీన 8 గంటలకు యాగశాల ప్రవేశం, పుణ్యాహవచనం, మహాగణపతి పూజ, రుత్విక్ వరణం, సాయంత్రం అంకురార్పణలో భాగంగా ధ్వజారోహణం.

☛ 11 నుంచి నాలుగు రోజుల వరకు ఉభయ ఆలయాల్లో అర్చనలు, చండీహోమం, మండపారాదన, బలిహరణ, నీరాజన మంత్ర పుష్పం.

☛ 14న ఉదయం 8 గంటలకు వసంత పంచమి, యాగశాలలో నిత్యహోమం, మహాపూర్ణాహుతి, కలశ ఉద్వాసన, పంచామృతాభిషేకం, సాయంత్రం జోగుళాంబ సహిత బలబ్రహ్మేశ్వర స్వామికి కల్యాణం, చివరి రోజున జోగుళాంబ దేవి నిజరూప దర్శనం. నిజరూప దర్శనంలో ఉన్న అమ్మవారికి అభిషేకం చేసేందుకు కలశాలతో భక్తులు తరలివస్తారు.

### ఏర్పాట్లు పూర్తి

ఉత్సవాలకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. ఉమ్మడి జిల్లాతోపాటు తెలంగాణ, కర్ణాటక, ఏపీ, మహారాష్ట్ర నుంచి భక్తులు తరలిరానున్నారు. ఈ నేపథ్యంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ చైర్మన్ చిన్న కృష్ణయ్య నాయుడు, ఈవో పురేందర్‌కుమార్ ఆధ్వర్యంలో అన్ని చర్యలు చేపట్టారు.





విద్యుద్దీప కాంతుల్లో అలంపూర్ ఆలయం (ఇన్‌సెట్లో) జోగుళాంబ దేవి

# జాతరెళ్లి పోదాం

# కోర్కెలు తీర్చే వేంకటేశుడు

- పాలెంలో రేపటి నుంచి 18 వరకు ఉత్సవాలు

బిజినేపల్లి, ఫిబ్రవరి 9 : కోరిన కోర్కెలు తీర్చే దేవుడిగా పాలెం వేంకటేశ్వరస్వామి విరాజిల్లుతున్నారు. ఆనాటి నుంచి నేటి వరకు తిరుపతికి వెళ్లలేని పేదలు ఇక్కడ ఉన్న స్వామిని దర్శించుకుంటారు. గ్రామ నిర్మాత దివంగత తోటపల్లి సుబ్రమణ్యశర్మ ప్రోద్బలంతో అతని సన్నిహితులైన రామలింగయ్య, బాల్‌లింగయ్యలు 13 ఎకరాల భూమిని కొనుగోలు చేసి ఆలయ నిర్మాణానికి పూనుకున్నారు. గ్రామంలో ప్రధాన రహదారికి సమీపంలోనే ఉన్న ఆలయంలో మూల విరాట్ విగ్రహాన్ని 1962లో తిరుమల పాపనాశిని వద్ద, అలివేలు మంగ అమ్మవారి విగ్రహాన్ని రాయచోటిలో తయారు చేయించి తీసుకొచ్చి ప్రతిష్ఠించారు. ఈ వేడుకకు నాటి సీఎం కాసు బ్రహ్మానంద రెడ్డి హాజరయ్యారు. ఇక్కడ ప్రతి ఏడాది మాఘమాసంలో బ్రహ్మోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా 11 నుంచి 18వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. ఉత్సవాల్లో ప్రధాన ఘట్టాలైన కల్యాణం, రథోత్సవం వైభవంగా జరిపించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లా నలుమూలల నుంచే కాకుండా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలివస్తుంటారు. వారి సౌకర్యార్థం ఈవో రంగారావు, మాజీ చైర్మన్ శేఖర్‌రెడ్డి చర్యలు చేపట్టారు.

### వారం రోజుల పాటుఉత్సవాలు


11 నుంచి 18వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. 11న అభిషేకాలు, భాగవత పద్యపటన పోటీలు, యాగశాల ప్రవేశం, అంకురార్పణ, 12న హోమ బలిహరణం, ధ్వజారోహణం, హోమం, బలిహరణ, భేరి పూజ, 13న ప్రభంద పారాయణం, హోమ బలిహరణ, లక్ష పుష్పార్చన, సుప్రభాత పోటీలు, ఎదుర్కోళ్లు, 14న ప్రబంధ పారాయణం, హోమ బలిహరణ, అలివేలు మంగ సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణం, గజ వాహన సేవ, 15న ప్రభంజ పారాయణం, నివేదన, ఉమ్మడి జిల్లా స్థాయి భజన పోటీలు, పల్లకీసేవ, 16న నిత్యారాధన, రథోత్సవం, సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు, 17న నిత్యారాధన, ఉద్దాల మహోత్సవం, అశ్వవాహనసేవ, 18న నిత్యారాధన, హోమం పూర్ణాహుతి, బలిహరణ, చక్రస్నానం, వివిధ పోటీలు, శేషవాహన సేవ, పండితులకు సన్మానం ఉంటుంది.





వేంకటేశ్వరస్వామి ఆలయం





కోనేరు

### నాటి మత్స్యపురి..

# నేటి గంగాపురం

- 10 నుంచి 18 వరకు ఉత్సవాలు
- దాసంగాలు సమర్పించనున్న భక్తులు

జడ్చర్ల, ఫిబ్రవరి 9 : గంగాపురం శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయం ఉమ్మడి జిల్లాలోనే ప్రసిద్ధి గాంచింది. ఏటా మాఘశుద్ధ పాడ్యమిన బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తారు. ఇందులో భాగంగా 10 నుంచి 18వ తేదీ వరకు ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. వేడుకలకు తెలంగాణ ప్రజలే కాకుండా ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారు. శనివారం నుంచి 18వ తేదీ వరకు ఉత్సవాలను నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ఆలయాన్ని రంగులతో తీర్చిదిద్ది విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు.

### ఆలయ చరిత్ర

లక్ష్మీసమేతుడైన నారాయణుడు ఈ క్షేత్రంలో చెన్నకేశవుడు స్వయంభువుగా వెలిశాడని పురాణాలు చెబుతున్నాయి. కృతయుగంలో మత్స్యపురిగా, త్రేతాయుగంలో దురిత కోలాహలంగా, ద్వాపర యుగంలో మాయాపురంగా, కలియుగంలో గంగాపూర్‌గా వెలుగొందుతున్న ప్రాంతం. పాల్కురికి సోమనాథుని పండితారాధ్య చరిత్రలో గంగాపురం చెన్నకేశవస్వామి ఆలయ ప్రాముఖ్యతను వివరించారు. ఈ ఆలయ శిల్పకళ చూపరులను కట్టిపడేస్తుంది. తొలుత రాతితో నిర్మించిన ప్రాకారం, దానిపై మట్టితో నిర్మించిన ప్రాకారం ఉండడంతో ఇతర ఆలయాలకు భిన్నంగా కనిపిస్తుంది. ఈశాన్య దిశలో రాతితో నిర్మించిన లోతైన పుష్కరిణి (కోనేరు) ఉన్నది.

### ఉత్సవాలు ఇలా..

10న పుణ్యాహవాచనం, అష్టోత్తర శత(108)కలశాలతో అభిషేకం, 11న అంకురార్పణ, పల్లకీసేవ, 12న ధ్వజారోహణం, హనుమత్ వాహనసేవ, 13న తిరుకల్యాణం, రాత్రి 9 గంటలకు స్వామి కల్యాణం, 14న శేషవాహన, హంసవాహన సేవలు, 15న పుష్పరథం(చిన్నతేరు), 16న రాత్రి 10 గంటలకు రథోత్సవం (పెద్దతేరు), 17న శకటోత్సవం(బండ్లు), 18న చక్రతీర్థంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.

### ఏర్పాట్లు చేశాం..

ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటాం. మంచినీటి సమస్య లేకుండా మిషన్ భగీరథ నీటితో పాటు ట్యాంకర్లు ఏర్పాటు చేస్తాం. రాత్రి వేళ భక్తులు ఉండేందుకు షెడ్లల్లో వసతి, సీసీ కెమెరాలను ఏర్పాటు చేశాం. అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయిస్తాం. హెల్త్‌క్యాంప్, కాలకృత్యాల కోసం మరుగుదొడ్ల సౌకర్యం కల్పించాం. మహబూబ్‌నగర్, కల్వకుర్తి, షాద్‌నగర్ డిపోల నుంచి ప్రత్యేక బస్సులు తిరుగనున్నాయి. దర్శనం కోసం క్యూలైన్లను ఏర్పాటు చేశాం.

- దీప్తిరెడ్డి, ఈవో, గంగాపూర్



గంగాపూర్ చెన్నకేశవస్వామి ఆలయం